మైక్ సెట్ అందజేత

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు మైక్ సెట్‌ను అందించారు. సోమవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, ఆయన కుమార్తె లక్ష్మీపూజిత పాఠశాలకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, బీఆర్‌ఎస్ నాయకులు రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వెస్ట్ జోనల్ కమిషనర్‌గా ఉపేందర్‌రెడ్డి.. బాధ్యతలు స్వీకరణ



గచ్చిబౌలి: శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్‌గా పి.ఉపేందర్ రెడ్డి నియమితులయ్యారు. సోమవారం సాయంత్రం వెస్ట్ జోనల్ కమిషనర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. జోనల్ కమిషనర్‌గా పని చేసిన స్నేహ శబరీష్‌ను జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్‌కే పరిమితం చేశారు. 2008లో మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్‌గా ఉపేందర్‌రెడ్డి విధుల్లో చేరారు. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ (శానిటేషన్) ఉండగా బదిలీపై వెస్ట్ జోనల్ కమిషనర్‌గా వచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం, మౌళిక వసతుల కల్పనపై దృష్టిసారిస్తానన్నారు. ఉప కమిషనర్లు, ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులు జడ్సీకి స్వాగతం పలికారు.

సమీక్షా సమావేశం

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానందనగర్ డివిజన్‌లో సోమవారం జీహెచ్‌యంసీ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. మంజూరైన రోడ్లు, సీవరేజ్ లైన్లు వీలైనంత త్వరగా పూర్తి చేయించాలని కోరారు. ఈ సమావేశంలో వార్డు ఆఫీసర్ వాహిద్ అలీ, ఏఈ ఆశ, హెచ్‌ఎండబ్ల్యూయస్ మేనేజర్ ప్రియాంక, సీఓ సుజాత, ఎస్‌ఆర్‌పి వినయకాంత్, హార్టికల్చర్ సూపర్‌వైజర్ దివ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరేష్, జీహెచ్‌యంసీ ఎలక్ట్రికల్ లైన్‌మేన్ భద్రయ్య పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నిరసన



రాయదుర్గం: విద్యార్థులపై సస్పెన్షన్ వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం నిరసన తెలిపింది. ఇటీవల వైస్‌చాన్స్‌లర్ లాడ్జ్ ముందు నిరసన తెలిపిన విద్యార్థులను సస్పెండ్ చేస్తూ ఫైన్ వేశారు. దీంతో ప్లకార్డులు చేతిలో పట్టుకొని బైఠాయించి నిరసన తెలిపారు. సస్పెన్షన్ వెంటనే ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



రాజేంద్రనగర్: బుద్వేల్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబ కల్యాణ మహోత్సవం సోమవారం కనుల పండువగా జరిగింది. ఈ కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చారు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలపించిన భక్తి గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు

మాదాపూర్: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోబోయిన వ్యక్తిని మాదాపూర్ పోలీసులు రక్షించారు. మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పర్వత్‌నగర్‌కు చెందిన యం. సాయికిరణ్ (23) క్యాబ్ డ్రైవర్.గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి ఆర్థికంగా ఇబ్బందులు పడ్డాడు. బాధలు భరించలేక కేబుల్ బ్రిడ్జిపై నుంచి దుర్గం చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించగా మాదాపూర్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు పట్టుకుని కౌన్సిలింగ్ ఇచ్చి తిరిగి పంపించారు.

భయం.. భయం

ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్లు • వేలాడుతున్న విద్యుత్ వైర్లు • భయాందోళనలో ప్రజలు



శేరిలింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలో వేలాడుతున్న విద్యుత్ వైర్లు

శేరిలింగంపల్లి: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటికి పలుచోట్ల ఫెన్సింగ్ లేకపోవడంతో బాటు వైర్లు కిందకి వేలాడుతుండడంతో ఎపుడు ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు భయపడుతున్నారు. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, సాధారణ ఇళ్ల నిర్మాణం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో విద్యుత్ వినియోగం కూడా అదే స్థాయిలో పెరగడంతో అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, ఉన్న వాటి సామర్థ్యం పెంచడం చేస్తున్నారు. కాగా ఉన్నవాటికే కాకుండా కొత్తగా ఏర్పాటు చేసే ఈ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ప్రత్యేకంగా కంచె ఏర్పాటు చేయకపోవడం.. పరిసరాల్లో నివాసముండేవారు నిత్యం భయాందోళనకు గురికావాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రతి కాలనీ, బస్తీలో మూడు నుంచి నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు, ఇక అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలకు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తుండడంతో వీటి సంఖ్య పెరుగుతూ పోతోంది. శేరిలింగంపల్లిలోని పలు కాలనీలు, బస్తీలలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ వైర్లు యమపాశాల్లా వేలాడుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతోఆయా కాలనీలవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- శేరిలింగంపల్లిలోని హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ, నల్లగండ్ల మార్కెట్, లింగంపల్లి రైల్వే స్టేషన్ ఎదురుగా, గుల్‌మొహర్ పార్కు చౌరస్తా, బాపూనగర్, డోయన్స్ టౌన్‌షిప్, సుదర్శన్‌నగర్–ఆలిండ్ హౌసింగ్ సొసైటీ తదితర ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయి.
- ట్రాన్స్‌ఫార్మర్లను పిల్లర్‌పై ఏర్పాటు చేసినా విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతుండటం స్థానికులను కలవరపరుస్తోంది. ఈ వైర్ల వల్ల చిన్నారులు ప్రమాదాలకు గురవుతారని ఆందోళన చెందుతున్నారు.
- ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూరా వ్యర్థాలు, పిచ్చి మొక్కలు ఉండడంతో మూగజీవాలు అక్కడ తచ్చాడుతున్నాయని అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెను నిర్మిస్తే ప్రమాదాలను చాలావరకు అరికట్టవచ్చని కాలనీ, బస్తీవాసులు అభిప్రాయపడుతున్నారు.
- అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోకపోవడంతో నిత్యం భయపడాల్సి వస్తోందని స్థానికులు వాపోయారు.



గుల్‌మొహర్‌పార్కు కాలనీ చౌరస్తాలో ..





లింగంపల్లి రైల్వే స్టేషన్ 6వ ప్లాట్‌ఫారం వైపు రోడ్డుపై ఉన్న కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్‌లు



నల్లగండ్ల కూరగాయల మార్కెట్ ప్రహరీ పక్కన..

చెరువులోకి మురుగునీరు చేరకుండా చర్యలు

డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి

రాయదుర్గం: గోపన్‌పల్లి, గోపన్‌పల్లితండా చిన్నాపెద్ద చెరువులోకి మురుగునీరు వచ్చి చేరకుండా శాశ్వత చర్యలు తీసుకుంటామని శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లితండా, గోపన్‌పల్లి మధ్యన ఉండే చిన్నాపెద్ద చెరువులో చేపలు మృతి చెందిన ప్రదేశాన్ని ఆయన గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు న్యాయం చేసేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామం నుంచి వెలువడే మురుగు నీరు నేరుగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ద్వారా చెరువులోకి విడిచారని, దీంతో చేపలు మృతి చెందాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హన్మంతునాయక్, తిరుపతి, నర్సింగ్‌నాయక్, శేఖర్, రంగస్వామి, మహేష్, నగేష్, రంగస్వామి, విక్రమ్, టింకు, గోవర్ధన్, వీరస్వామి పాల్గొన్నారు.

ప్రజావాణి.. వినతులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ప్రజావాణిలో ప్రజలు పలు సమస్యలను వివరించారు. ముఖ్యంగా ఉచిత విద్యుత్‌కు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా వచ్చినట్లు తెలిపారు. టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగాల సమస్యలు కూడా వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, ప్రాజెక్టు విభాగం అధికారులు పాల్గొన్నారు.

చందానగర్ సర్కిల్‌లో..



ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు అందజేస్తున్న దృశ్యం

హఫీజ్‌పేట్: చందానగర్ సర్కిల్‌– 21 కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో 05 వినతిపత్రాలు వచ్చాయని ఉపకమిషనర్ వంశీ కృష్ణ తెలిపారు. ఇందులో 4 టౌన్‌ప్లానింగ్‌కు, మరొకటి ఇంజనీరింగ్ సెక్షన్‌కు సంబంధించి ఫిర్యాదులు చేశారన్నారు.

శంకుస్థాపన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ సండే మార్కెట్ వద్ద రూ.40లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు సోమవారం కార్పొరేటర్ పుష్పనగేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డుపై నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

చట్టాల గురించి తెలుసుకోవాలి

పటాన్‌చెరు టౌన్: ప్రతి ఒక్కరు మహిళలను గౌరవించాలని షీ టీం ఎస్‌ఐ నాగలక్ష్మి అన్నారు. సోమవారం జిల్లా శిశు సంక్షేమశాఖ మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భేటీ బచావో... బేటి పడావోలో భాగంగా పోక్సో చట్టాలు, మహిళలు, బాలికలకు సంబంధించిన చట్టాలు హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షీ టీం ఎస్‌ఐ నాగలక్ష్మి విచ్చేసి, మాట్లాడుతూ... విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా షీ టీంకు తెలియజేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.అనంతరం విద్యార్థులకు సైబర్ నేరాలు ,సోషల్ మీడియాలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీరామ్, సుధాకర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ హెడ్ కానిస్టేబుల్ శివకుమార్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

పటాన్‌చెరు టౌన్: అంగన్‌వాడీలో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ అన్నారు. సోమవారం ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి బోధనపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని చంద్రకళ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...పిల్లలలో సమగ్ర అభివృద్ధి జరగటానికి, నూతన పాఠ్యప్రణాళికపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మణెమ్మ, ప్రతిభ, సల్మా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

డైమండ్‌హైట్స్‌లో డీసీ పర్యటన

రాయదుర్గం: డైమండ్‌హైట్స్‌లో అభివృద్ధి పనులకు తగిన ప్రణాళికలు రూపొందిస్తామని శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లి డైమండ్‌హైట్స్ కాలనీలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి ఆయన సోమవారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీసీరోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్, వాటర్ పైప్‌లైన్‌ల ఏర్పాటుకు జరిగేలా చూస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. అసంపూర్తి, పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతి పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం కాలనీవాసులు మాట్లాడుతూ వర్షాలు కురిస్తే చెరువు నిండి నీరు పెద్ద ఎత్తున బయటకు వస్తోందని, రోడ్లన్నీ జలమయం అవుతున్నాయని, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పార్కుల స్థలంలో ఓపెన్‌జిమ్, చిల్డ్రన్ పార్కు, క్రీడాప్రాంగణం, విద్యుత్ సమస్యను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందించారు. మంజీరా డైమండ్‌హైట్స్ అధ్యక్షుడు ప్రసాద్, స్థానికులు రేవతి, పద్మ ,ఉదయలక్ష్మీ, సత్యనారాయణ, బెనర్జీ, శ్రావణ్, సూర్యనారాయణరాజు, ప్రసాద్, ఆశుకక్కర్, సెల్విన్, శ్యామ్, అశోక్, సుమంత్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న డీసీ రజనీకాంత్‌రెడ్డి, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, అధికారులు

‘మనూ’లో ప్రవేశాలకు 30వ తేదీ ఆఖరు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మెరిట్ ఆధారిత కోర్సులలో ప్రవేశాలకు జూన్ 30వ తేదీ ఆఖరు అని ‘మనూ’ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వనజ సోమవారం తెలిపారు. యూనివర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరానికి దేశవ్యాప్తంగా, హైదరాబాద్‌లోని ప్రధాన క్యాంపస్, శాటిలైట్ క్యాంపస్‌లలో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందని ఆమె వివరించారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. మెరిట్ ఆధారిత పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులు,ఎంఎస్‌డబ్ల్యూ(సోషల్ వర్క్), జర్నలిజమ్, మాస్ కమ్యూనికేషన్, ఎంఏజేఎంసీ(లేటరల్ ఎంట్రీ) ఎంకామ్, ఎంఎస్సీ, ఒకేషనల్ కోర్సులు, ఎంఎల్‌టీ, ఎంఐటీ, పీజీ డిప్లొమో ఇన్ టీచింగ్ ఇంగ్లీష్, ఎంసీఏ (లేటరల్ ఎంట్రీ), పీజీ డిప్లొమో కోర్సులు, వివిధ సర్టిఫికెట్ కోర్సులు అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. ఇతర వివరాలకు అడ్మిషన్ హెల్ప్‌డెస్క్ ఫోన్ నంబర్లు 6207728673,9866802414, 6302738370, 75004693643లో సంప్రదించాలని ఆమె సూచించారు.

జగదీశ్వర్‌గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు



సీఎం రేవంత్‌రెడ్డి, భట్టివిక్రమార్కలను కలిసిన జగదీశ్వర్‌గౌడ్



నల్లగండ్లలో.. కార్పొరేటర్లు హమీద్ పటేల్, వెంకటేష్‌గౌడ్, నాయకులు

శేరిలింగంపల్లి: సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలను కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జీ వి.జగదీశ్వర్ గౌడ్ సోమవారం కలిశారు. జగదీశ్వర్‌గౌడ్ జన్మదినం సందర్భంగా వారు పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నల్లగండ్లలో వేడుకలు

కార్పొరేటర్ వి.జగదీశ్వర్‌గౌడ్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, వివిధ కాలనీల సంఘాల ప్రతినిధులు, అభిమానులు నల్లగండ్లలోని ఆయన నివాసానికి తరలివచ్చి పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్, కార్పొరేటర్లు హమీద్ పటేల్, దొడ్ల వెంకటేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు మిరియాల రాఘవరావు, ప్రీతమ్, కృష్ణ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు కోసం వినతి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని విజయనగర్ కాలనీవాసులు పలు సమస్యలు, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే గాంధీని సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను త్వరలో పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్షులు సత్యనారాయణ,సెక్రటరి స్వరూప, జనరల్ సెక్రటరీ హన్మంతరావు, ఉపాధ్యక్షులు రఘుపతిరావు, మురళీకృష్ణ, కాలనీవాసులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేసిన అసోసియేషన్ సభ్యులు

ప్రొ.ప్రభాకర్‌రావుకు అంతర్జాతీయ అవార్డు



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జే ప్రభాకర్‌రావుకు అంతర్జాతీయ అవార్డు లభించింది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ డీన్ ప్రభాకర్‌రావుకు ఇన్ఫర్మేషన్ సొసైటీ డెవలప్‌మెంట్‌కు చేసిన కృషికి ఎవ్జెనీ కుజిన్ ఇంటర్నేషనల్ అవార్డు లభించింది. ఇటీవల యునెస్కో ఇంటర్ గవర్నమెంటల్ ఫ్రేమ్‌వర్క్‌లో రష్యన్ ఫెడరేషన్‌లోని ఖాంటీ మాన్సిస్క్‌లో జరిగిన ఆరవ ‘టాంజిబుల్ అండ్ ఇంటాంజిబుల ఇంపాక్ట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ ఇన్ ది డిజిటల్ ఏజ్’ అంతర్జాతీయ సదస్సులో ప్రభాకర్‌రావు అవార్డును స్వీకరించారు.

యువకుడు అదృశ్యం



మియాపూర్: ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం... హఫీజ్‌పేట ప్రేమ్‌నగర్‌కు చెందిన ఎన్. మహేష్(20) స్థానికంగా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 21న రాత్రి 7.40 గంటలకు ఇంటి నుండి బయటకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు మహేష్ కోసం బంధువు, స్నేహితుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూములను ఆక్రమించకుండా కట్టుదిట్టమైన చర్యలు

- జేసీబీలతో స్థలం చుట్టూ భారీ గుంతల తవ్వకం
- సర్వే నంబర్ 100, 101లో కొనసాగుతున్న సర్వే

మియాపూర్: మియాపూర్‌లోని సర్వే నంబర్ 100, 101 భూములను ఆక్రమించకుండా హెచ్‌ఎండీఏ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. స్థలంలోకి ఎవరూ వెళ్లకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆరు జేసీబీలతో భూమి చుట్టూ భారీగా గుంతలు తవ్వుతున్నారు. హెచ్‌ఎండీఏ, రెవెన్యూ అధికారులు 100, 101 చుట్టూ మార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు. దీని చుట్టూ కంచె ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. కాగా ఈ స్థలంలో గుడిసెలు వేసే క్రమంలో ఉద్రిక్తత నెలకొన్న విషయం విదితమే. గత ఐదు రోజుల నుండి వివిధ ప్రాంతాల నుండి ఇళ్ల స్థలాల కోసం మియాపూర్‌లోని 100 , 101 సర్వేనంబర్‌లో గుడిసెలు వేసేందుకు వేలాది మంది జనం తరలి రావడంతో వారిని అక్కడి నుంచి పంపించే క్రమంలో మియాపూర్ ప్రాంతమంతా రణరంగంగా మారింది. ప్రస్తుతం ఆదివారం ఉదయం 6 గంటల నుండి 144 సెక్షన్ అమలు చేయడంతో సద్దుమణిగింది. సోమవారం నాటికి మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రశాంత వాతావరణం నెలకొంది. ఈ ప్రాంతంలో పోలీస్ పహారా కొనసాగుతుంది. అలాగే హుడా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.



మియాపూర్‌లోని 100, 101 సర్వేనంబర్ భూమి చుట్టూ జేసీబీతో గుంతలు తవ్వుతున్న దృశ్యం

ఆగని కబ్జాలు...

మియాపూర్ సర్వేనంబర్ 100 , 101లో సుమారు 500 ఎకరాల భూమి ఉంది. ఈ భూములు తమవి అంటూ గత 30 సంవత్సరాల కిందట ప్రైవేటు సంస్థలు కోర్టుకు వెళ్లాయి. హైకోర్టులో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు రావడంతో తిరిగి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అప్పటి నుండి హెచ్‌ఎండీఏ పర్యవేక్షణ బాధ్యతలను నిర్వహిస్తోంది. నగరంలో భూముల ధరలు భారీగా పలుకుతుండడంతో కబ్జాలకు తెరలేపుతున్నారు. హెచ్‌ఎండిఏ పర్యవేక్షణలో ఉండగానే ఈ భూమి సుమారు 60 ఎకరాలు కబ్జాకు గురైంది. మియాపూర్‌లోని ఎంఏనగర్, స్టాలిన్ నగర్, దీప్తిశ్రీనగర్, పీఏనగర్, ప్రశాంత్‌నగర్ కాలనీల సమీపంలో కబ్జాలు చేసి నిర్మాణాలు చేపట్టారు. దీప్తిశ్రీనగర్ కాలనీ సర్వేనంబర్‌లోని ప్లాట్లకు బై నంబర్లు వేసి పదుల సంఖ్యలో ప్లాట్లు వేశారు. వాటికి అడ్డదారిలో అనుమతులు తీసుకుని నిర్మాణాలు కూడా చేపట్టారు. ప్రస్తుతం ఈ భూమిని సర్వేచేసి కబ్జాలను తొలగించి కంచె వేస్తారా.. లేదా... నిర్మాణాలను వదిలేసి వాటి పక్క నుండి కంచె వేస్తారా అనే సందేహాలు వెలువడుతున్నాయి.

భూ వివాదంలో మరో 10 మంది అరెస్ట్

మియాపూర్ హెచ్‌ఎండీఏ భూమి వివాదంలో మరో 10 మందిని అరెస్ట్ చేసిన ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాలిలా ఉన్నాయి. మియాపూర్‌లోని హెచ్‌ఎండీఏ ఆధీనంలో ఉన్న సర్వే నెంబర్ 100,101 భూమిలో ఇళ్ల స్థలాలు ఇస్తున్నారని తప్పుడు ప్రచారం చేయడంతో గుడిసెలు వేసి ఆక్రమించేందుకు యత్నించగా వారిని అడ్డుకుని పోలీసులు భూములపై అవగాహన కల్పిస్తుండగా పోలీసులపై రాళ్లతో దాడి చేసిన 50 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం 21మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో 10 మందిని సోమవారం అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఇందులో పత్లావత్ మోహన్, మూడవత్ మోహన్, దేవమ్మ, చౌహన్ దినేష్, కుమార్ నాయక్, కిషన్, రవి, మంద నగేష్, ప్రభాక ర్, మధులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.